క్లుప్తంగా

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కపిలేశ్వరపురం: మండలంలో 469 మంది 8వ తరగతి విద్యార్థులు, 68 మంది ఉపాధ్యాయులు మొత్తం 537 మందికి బైజూస్ ఎడ్యుకేషనల్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను పంపిణీ చేసినట్టు ఎంఈఓ కె.తాతారావు తెలిపారు. ట్యాబ్ విలువ రూ.16,500 కాగా అందులోని కంటెంట్ విలువ రూ.15,500 మొత్తం ఒక్కో ట్యాబ్ ఉపయోగపు విలువ రూ.32 వేలు అన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వల్లూరు విద్యార్థులు 52 మంది, కాలేరు 31, నల్లూరు 24, అంగర 82, టేకి 41, కపిలేశ్వరపురం 68, మాచర 66, వాకతిప్ప 25, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తాతపూడి 7, వెదురుమూడి 22, కేదారిలంక 17, నారాయణలంక 4, కె.రావులపాలెం 14, అద్దంకివారిలంక 16 మొత్తం 469 మందికి ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు 68 మందికి ట్యాబ్‌ల పంపిణీ చేశారని ఎంఈఓ తెలిపారు.

కాపునాడు రాష్ట్ర కార్యదర్శిగా దొరబాబూజీ


అనిశెట్టి దొరబాబూజీ, కాపునాడు రాష్ట్ర కార్యదర్శి

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెం గ్రామ సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ కుమారుడు అనిశెట్టి దొరబాబూజీ కాపునాడు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు వీపీ నారాయణస్వామి రాయల్ నుంచి ఉత్తర్వులు అందినట్లు దొరబాబు తెలిపారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో మండల, పట్టణ కమిటీలను ఏర్పాటు చేసే బాధ్యత తనపై ఉంచారని అన్నారు.

వరి సాగులో నాట్ల దశ కీలకం

కాజులూరు: వరి పంట సాగులో నాట్లు దశ కీలకమైనదని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించి నాట్లు వేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ముఖ్యంగా చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూడటం, పైపైనే నాట్లు వేయడం, కుదురుకు రెండు నుంచి మూడు మొక్కలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాటే ముందు వరి మొక్క సుతలను తుంచి నాటాలని చెప్పారు. దీనివల్ల ఆకు సుతల్లో ఉండే హిస్ప, కాండం తొలుచు పురుగు గుడ్లు ప్రధాన పంటకు సోకకుండా జాగ్రత్త తీసుకున్నట్టు అవుతుందన్నారు. వీఏఏ శిరీష, రమ్య, పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆందోళన

కాజులూరు: సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ మంగళవారం కాజులూరులో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు ఆందోళనలు చేపట్టారు. సంఘం జిల్లా సహాధ్యక్షుడు ఐ.ప్రసాదరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు గ్రామ వీధులలో 3కే వాక్ నిర్వహించి మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

డంపింగ్ యార్డ్‌కు నిప్పు

మండపేట: పట్టణంలోని డంపింగ్‌యార్డుకు మంగళవారం ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. పొగ దట్టంగా కమ్మేయడంతో స్థానికులు ఆందోళనకు గురై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ సిబ్బంది ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. మండపేట ఫైర్ ఇంజిన్ అందుబాటులో లేకపోవడంతో అనపర్తి నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

చికిత్స పొందుతూ వీఆర్ఓ మృతి

కాజులూరు: చికిత్స పొందుతూ మండలంలోని కోలంక సచివాలయం-2 కి చెందిన వీఆర్‌ఓ తణుకు సాదుపుల్లయ్య (48) మృతి చెందారు. ఐదు రోజుల క్రితం బీపీ అధికమై సాదుపుల్లయ్య స్పృహ తప్పి పడిపోయారు. కుటుంబ సభ్యులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తహసీల్దారు బి. సాయిసత్యనారాయణ, ఆర్ఐ వేగేశ్వర్రావు, రెవిన్యూ సిబ్బంది మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

వేలిముద్రపై మినహాయింపు ఇవ్వాలి

కె.గంగవరం: రేషన్ సరుకుల పంపిణీలో నూతన విధానం ప్రకారం ప్రతి సరకుకి వేలిముద్ర వేయాలన్న నిబంధనకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కె.గంగవరం తహసీల్దారుకు రేషన్ పంపిణీ ఆపరేటర్స్ వినతిపత్రాన్ని అందజేశారు. అన్ని సరుకులకూ ఒకేసారి వేలిముద్ర వేయించే పాత విధానాన్ని కొనసాగించాలని వారు కోరారు. పంపిణీ ఆపరేటర్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గెద్దాడ లోవరాజు, కావూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రంగంపేట: స్థానిక శ్రీసత్యసాయి సమాజ సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చెవి, ముక్కు, గొంతు ఉచిత వైద్య శిబిరంలో సుమారు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. రాజమహేంద్రవరం శ్రీసాయి సరస్వతి చెవి, ముక్కు, గొంతు వైద్యశాల డాక్టర్ పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మెడికల్ ఇన్‌చార్జి కాకినాడ సత్తిబాబు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాలను స్వాగతిస్తున్న డివైడర్లు

- నాలుగేళ్లలో 20 మందికి పైగా మృతి
- అధికారుల ఉదాసీనత

రామచంద్రపురం: స్థానిక ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన డివైడర్ల మూలంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. 20 మందికి పైగా గడచిన నాలుగేళ్లలో బలయ్యారు. సుమారు 50కి పైగా ప్రమాదాలు చోటు చేసుకోగా ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. ప్రమాదాలలో మచ్చుకు కొన్ని...

- పసలపూడిలో వీఆర్వోగా పనిచేస్తున్న నేదునూని నానిబాబు విధులు నిర్వహించుకుని ఇంటికి తిరిగి వస్తూ డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందారు.
- ఆసుపత్రిలో నర్సుగా పనిచేసే ఒక మహిళ రోడ్డు దాటుతుండగా డివైడర్‌ను ఢీకొట్టిన ట్రాక్టరు అదుపుతప్పి ఆమెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.
- డఫేదార్ సెంటర్‌లో తెల్లవారుజామున డివైడర్ కనిపించకపోవటంతో లోడుతో వెళుతున్న లారీ.. పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో మధ్యలోనే లారీ ఆగిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ నిలిపివేయటంతో పెను ప్రమాదాలు తప్పాయి.
- తాజాగా ఈనెల 1వ తేదీన తెల్లవారుజామున ప్రధాన రహదారిలో ఒక కారు డివైడర్‌ను ఢీకొట్టి కరెంట్ పోల్ కూడా విరిగిపోగా ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు.

రోడ్డు వేశారు.. విస్తరణ మరిచారు!

2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన రహదారిని సుమారు రూ.21కోట్లతో సీసీ రోడ్డు డ్రైన్లను వేసి అభివృద్ధి చేశారు. అయితే రోడ్డును సీసీ రోడ్డుగా మార్చారే తప్ప వెడల్పు చేయలేదు. వ్యాపారస్తులు, స్థానిక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అప్పట్లో రోడ్డును వెడల్పు చేయకుండానే సీసీ రోడ్డు, డ్రైన్ వేశారు. వీటితో పాటుగా మార్కెట్ సెంటర్, రామకృష్ణ సెంటర్ మినహా అటు రాజగోపాల్ సెంటర్ నుంచి వీఎస్ఎం కళాశాల వరకు, కాకినాడ రోడ్డులోని ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సీసీ రోడ్డు మధ్యలో సిమెంట్ దిమ్మలతో డివైడర్లను ఏర్పాటు చేశారు. మధ్యలో వీధి లైట్ల కోసం విద్యుత్ స్తంభాలను కూడా వేశారు. దీనికోసం అప్పట్లో మున్సిపాలిటీ నిధులు రూ.కోటి ఖర్చు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారిని మధ్యలో విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. అయితే నిబంధనల పాటించకుండా ఇరుకు రోడ్డులో డివైడర్లు వేయటంతో ప్రమాదాలు జరగటం మొదలయ్యాయి. దీంతో పాటుగా ట్రాఫిక్‌కు కూడా తీవ్ర అంతరాయం కలుగుతూ నిత్యం ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. మోటారు వాహనాలు, కార్లతో పాటుగా లారీలు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. డివైడర్లను అమర్చటం మూలంగా ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గత నాలుగేళ్లుగా ప్రజలు అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా డివైడర్లను తీసివేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.


డివైడర్లను కారు ఢీకొనటంతో చెల్లా చెదురు అయిన సిమెంట్ దిమ్మలు

వాహనాలు అదుపు తప్పుతున్నాయి



ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన డివైడర్ల మూలంగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. డివైడర్లకు వేసిన సిమెంట్ దిమ్మలను రాత్రి వేళల్లో ఆకతాయిలు అటు ఇటుగా జరుపేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం చూడాల్సిన అవసరం ఉంది.
– తొగరు మూర్తి, రక్షా ఫౌండేషన్ అధినేత

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం



గతంలో మెయిన్ రోడ్డులో డివైడర్‌లు సిమెంట్ దిమ్మలను ఏర్పాటు చేశాం. వాటిని అటూ ఇటూ కదిలించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పోలీస్ అధికారులతో సంప్రదించి డివైడర్లు స్థిరంగా ఉండేటట్టు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.
– టి.శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

నేడు పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో భాగంగా పెంచిన పెన్షన్ పంపిణీ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు రామచంద్రపురం పట్టణంలోని శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడాప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నట్టు రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ టి. శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ ఎస్.షెలత్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్, మండల ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

మండపేట: పట్టణం, మండలానికి నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ బుధవారం పట్టణంలోని ఏడిద రోడ్డులో గల విజయ ఫంక్షన్ హాల్‌లో జరుగనున్నట్టు వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు అందజేస్తారని పార్టీ కార్యాలయం కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సురేష్‌ది హత్యేనా?

- మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు
- రెండు ప్రత్యేక బృందాల ఏర్పాటు

మండపేట: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా పట్టణంలో చోటుచేసుకున్న యువకుని అనుమానాస్పద మృతిపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. మృతుని తలపై గాయాలను బట్టి హత్యకు గురై ఉండవచ్చునన్న కోణంలో రెండు ప్రత్యేక బృందాలతో పలు కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని నాళం వారి వీధిలోని స్టూడియోలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న కొనిజాల సురేష్ (28) శనివారం రాత్రి తన స్నేహితుడైన కారు డ్రైవర్ వీరబాబుతో కలిసి నూతన సంవత్సర వేడుకలకు వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం విదితమే. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మద్యం సేవించిన తర్వాత సురేష్‌ను మోటారు సైకిల్‌పై మెయిన్‌రోడ్డులోని థియేటర్ సమీపంలో దించి వెళ్లిపోయానని వీరబాబు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. కాగా సురేష్ తలపై గాయాలను బట్టి హత్యకు గురై ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుని బంధువులు, స్నేహితులు పోలీసుల వద్ద వీరబాబుతో పాటు పలువురిపై అనుమానం వ్యక్తం చేసినట్టు తెలిసింది. తమ పరిశీలనలో తేలిన విషయాలను బట్టి సీసీ టీవీ ఫుటేజీలు, అనుమానితుల కాల్‌డేటా వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్టు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మృతుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే మృతిపై స్పష్టత వస్తుందని పోలీసులు అంటున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఎవరిని అరెస్టు చేయలేదని వారు తెలిపారు.

అధినేతకు స్వాగతం


వైఎస్సార్ పింఛన్ పెంపు వారోత్సవాల్లో పాల్గొనడానికి మంగళవారం రాజమహేంద్రవరం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్


మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం


అంగరలో గ్రామస్తులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అంగరలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం

కపిలేశ్వరపురం: గ్రామాల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని అంగరలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ వాసా కోటేశ్వరరావు జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు తెలిపారు. పరిష్కారానికి అడ్డంకిగా మారిన సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. పెంచిన మొత్తంతో రూ.2,750 పింఛను డబ్బులు అందుకున్న వృద్ధులు, వితంతువులు సంతోషంతో ఎమ్మెల్సీ తోట వెంట నడిచారు. మహిళలు ఎమ్మెల్సీ తోటకు హారతి పట్టారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతుండటంతో ప్రభుత్వానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఓర్వలేని విపక్షాలు కులం, మతం, ప్రాంతాల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించేలా కుయుక్తులు పన్నుతున్నాయన్నారు. విపక్షాలకు చిత్తశుద్ధి ఉండి ఉంటే వారు అధికారంలో ఉన్నప్పుడు ఇన్ని పథకాలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను మాత్రమే నమ్ముకుని ముందుకు సాగుతున్నారని, తామంతా ఆయన వెంట నడుస్తూ ప్రజల మన్ననలను పొందుతామన్నారు. ఎవరికి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్సీ తోట ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పసలపూడి శ్రీనివాస్, గంగుమళ్ళ రాంబాబు, వీధి వెంకటరెడ్డి, అరదాని శ్రీదేవి, టీఏసీ సభ్యులు సూరంపూడి వెంకటరమణ, మామిడి రాంబాబు పాల్గొన్నారు.

చదువుల వెలుగు సావిత్రి ఫూలే


మహిళా ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఎంఈఓ తదితరులు


కపిలేశ్వరపురంలో సావిత్రిబాయి ఫూలేకి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే చదువుల వెలుగుగా అందరికీ ఆదర్శ మని ఉపాధ్యాయులు అన్నారు. కపిలేశ్వరపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.వెంకట్రాజు అధ్యక్షతన సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయురాలు అదపాక శ్రీదేవి మాట్లాడుతూ 1841 మొట్టమొదటి మహిళా పాఠశాల ప్రారంభించి మహిళా విద్యకు బాట వేశారని, ఆ కృషి ఫలితంగానే తమలాంటి కోట్లమంది మహిళలు విద్యా, ఉపాధి రంగాల్లో రాణించే అవకాశం దక్కిందన్నారు. దాసరి కృష్ణ కుమారి, ఎస్‌సీ రామానుజం, కె.కోమలి, కె.శ్రీలక్ష్మి, టి.లలిత కుమారి, ఎంవీఎల్ఎస్ఎల్ కుమారి, ఎం.విజయ దుర్గ పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి జయంతి

మండపేట: మొట్ట మొదటి మహిళ ఉపాధ్యాయురాలు స్వర్గీయ సావిత్రిబాయి పూలే 192వ జయంతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండపేటలో జరిగింది. స్థానిక పెద కాలువ వంతెన సమీపంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సంఘ జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, బీసీ సంఘం జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోన సత్యనారాయణ మాట్లాడారు. రిటైర్డ్ టీచర్ పంపన సూకరత్నంను సన్మానించారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ నీలం దుర్గ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహిళ దినోత్సవంలో సావిత్రిభాయి చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ కేటీఆర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళ సాధికారత ద్వారా దేశంలో సమాజాభివృద్ధికి సావిత్రిభాయి పూలే బాటలు వేశారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు, లెక్చరర్లు నాగపద్మ, విమల, సుధారాణి, కృష్ణవేణి, శాంతకుమారి, వెంకటలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నివాళి

రాయవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి ఎంపీపీ నౌడు వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: సావిత్రిబాయిపూలే ఆశయాలను నేటితరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు అన్నా రు. మండలంలోని గొల్లపాలెంలో మంగళవారం స్థాని క వైఎస్సార్ సీపీ నేత మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన సావిత్రిబాయిపూలే 192వ జయంతి కార్యక్రమాలలో బుల్లిరాజు పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దుగ్గుదూరులో బీసీ నేత కడలి రాంపండు ఆధ్వర్యంలోనూ, కుయ్యేరులో గ్రామ సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి నేతృత్వంలోనూ, కాజులూరులో మండల బీసీ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలోనూ నాయకులు సావిత్రిబాయిపూలే జయంతి నిర్వహించారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: స్థానిక శ్యామ్ ప్రసాద్ స్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ ఎ.నాగరాజు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి మాట్లాడుతూ మహిళా విద్యనందించాలన్న తపనతో దేశంలోనే మొదటి బాలికా విద్యాలయాన్ని స్థాపించిన ఘనత సావిత్రిబాయి పూలేకి దక్కుతుందన్నారు. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. లక్ష్మీనారాయణాచార్యులు, నేమాని రామకృష్ణ, శ్రీనివాసచౌదరి, ఏఓ రవిబాబు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: సావిత్రీబాయి పూలే 192వ జయంతి ద్రాక్షారామలో మంగళవారం నిర్వహించారు. బీసీ సేన అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామచంద్రపురం సీఐ దుర్గారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు తదితరులు సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కామాక్షీ పీఠాన్ని సందర్శించిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి

అమలాపురం టౌన్: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి వల్లూరి కామేశ్వరరావు అమలాపురంలోని శ్రీకామాక్షీ పీఠాన్ని మంగళవారం రాత్రి సందర్శించారు. పీఠాధిపతి కామేశ మహర్షి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కామేశ్వరరావును పీఠాధిపతి సత్కరించారు. ఆయనకు పీఠం జ్ఞాపిక, రెండు అధ్యాత్మిక పరిశోధన గ్రంథాలను అందించారు.


కామేశ మహర్షితో న్యాయమూర్తి కామేశ్వరరావు

తీర ప్రాంతాల్లో తాబేళ్ల మృత్యువాత



ఉప్పలగుప్తం: మండల పరిధి ఎస్.యానం సముద్ర తీరంలో తరుచూ తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఈ పరిస్థితి కొన్ని రోజులుగా ఉత్పన్నమవుతోందని స్థానికులు చెప్తున్నారు. మంగళవారం చనిపోయిన 3 తాబేళ్లు ఒడ్డుకు కొట్టుకువచ్చాయని వారు తెలుపుతున్నారు. జాలర్ల వలలకు చిక్కుకోవడం వలన, ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల ఇలా జరిగి ఉండవచ్చని వారు అంటున్నారు.

6న జాబ్‌మేళా

ముమ్మిడివరం: స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 6న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధిశిక్షణ, మరియు సీడప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. ఈ మినీ జాబ్‌మేళాలో మోహన్ స్పిన్ టెక్ ఇండియా లిమిటెడ్, స్కినీడైర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు పాల్గొని సుమారు 150 మందికి ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. జీతం రూ.13 వేల నుంచి 20 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు బయోడేటా, ఆధార్, ఐడీ ప్రూఫ్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రామచంద్రపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైనట్లు ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.పాపారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వెంకటాయపాలెంకు చెందిన బొలిశెట్టి రమేష్, దుర్గాప్రసాద్ కాకినాడ బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా వెంకటాయపాలెం వంతెన వద్దకు వచ్చేసరికి గోతిలో పడి ఇద్దరూ కింద పడిపోయారు. వెనుక నుంచి వస్తున్న వ్యాను రమేష్ కాళ్లపై నుంచి వెళ్లిపోయింది. దుర్గాప్రసాద్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో ఇద్దరినీ 108 వాహనంపై రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పాపారావు తెలిపారు.

నేడు పడమర ఖండ్రికలో గడప గడపకూ మన ప్రభుత్వం

కపిలేశ్వరపురం: గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో మండలంలోని పడమర ఖండ్రికలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం పర్యటించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే పర్యటనలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని, ప్రభుత్వ శాఖల అధికారులు పర్యటన సమయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరంలో సోమవారం పొలం వద్ద నీరు పెట్టే విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. యల్లబోయిన నాగేంద్రప్రసాద్‌పై గీసాల వీరవెంకట సత్యనారాయణ ఇనుప రాడ్డుతో దాడి చేసి తలపై కొట్టినట్లు ద్రాక్షారామ హెడ్ కానిస్టేబుల్ ఎస్.జ్యోతిబాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠ శాల మైదానంలో మంగళవారం యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లారి సూరిబాబు, జిల్లా సహాధ్యక్షులు పి.సురేంద్రకుమార్ పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు డీవీ రాఘవులు పాల్గొన్నారు.